




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## ౬వ భాగం

ప్రస్తుతానికి 1850 నెలలో వున్నాం. పసివాడి మరణం కలిగించిన విషాదం నుండి మార్క్స్ కుటుంబం నెమ్మది నెమ్మదిగా కోలుకుంటోంది. నవంబర్ 19న మరణిస్తే,ఆ తరువాత 2,3 నెలలకి అంటే, 1851 జనవరి చివరిలో మార్క్స్ మరోసారి ఇల్లు మారాల్సి వచ్చింది. బహుశా పిల్లవాడు అక్కడ మరణించాడనో, అద్దె కట్టలేక అవస్థలు పడుతుంటే ఇంటి ఓనర్ వెళ్లిపొమ్మన్నాడో తెలియదుగానీ, 64 డీన్ స్ట్రీట్ నుండి, 28 డీన్ స్ట్రీట్ కి మకాం మార్చారు. సహజంగానే ఎంగెల్సు వాళ్ళని ఆదుకొని, కొత్త ఇంట్లో స్థిర పడడానికి సహాయం చేశాడు. లండన్ వచ్చిన ఏడాది లో ఇది 3 వ ఇల్లు. ఈ ఇంట్లో కాస్త ఎక్కువ రోజులు అంటే, దాదాపు 5 సంవత్సరాల పాటు ఇదే ఇంట్లో వున్నారు.

ఈ ఇల్లు ఎలా ఉండే దంటే, 4అంతస్తుల భవనంలో పై అంతస్తులో 3 గదులు అద్దెకు తీసుకున్నారు. అంతకుముందు వున్న ఇల్లయితే ఒకటిన్నర గది మాత్రమే. ఇక్కడ మూడు గదుల ఇంట్లో ముందు గది 15x1o అడుగులు. అదే అతిధుల గదీ, మార్క్స్ రాసుకునే గదీ, పిల్లలు ఆడుకునే గదీ అన్నీఅదే. చివరి గది వంటకీ, స్నానాలకీ, పనిమనిషి

హెలెన్ పడుకోవడానికీ అది. ఇక మధ్య గదిలో మార్క్సు, జెన్నీలూ, పిల్లలూ పడుకునే గది. వీళ్ళు వుండే భాగం 4 అంతస్తులో వుండడం వలన నీళ్ళు పై వరకూ వచ్చేవి కావు. అందుకని జెన్నీ గానీ, హెలెన్ గానీ పైకి మోసుకు వెళ్ళవలసిందే. మరుగు దొడ్లయితే మరింత ఇబ్బందిగా ఉండేవి. ఇవన్ని కూడా 200 సంవత్సరాల క్రితం లండన్ లో పరిస్థితులు.

కాస్త ఓదార్పు ఏమిటంటే, పై అంతస్తు కాబట్టి, కిటికీలు తెరిస్తే, విశాలమైన లండన్ నగరం చాలా వరకు కనిపించేది. అది కూడా మేఘాలూ, మంచు తెరలూ లేనప్పుడు. ఈ ఇంట్లోకి మారాక మార్క్సు తను రాస్తున్న ఆర్థిక శాస్త్ర వ్యాసాల వేగం పెంచాడు. ఆ రాసే అంశాల గురించి ఏదైనా రాయగానే వెంటనే అదే రోజు ఎంగెల్సు కి వుత్తరం లో రాసేవాడు."ఇలా రాస్తున్నాను.నేను ఇలా అనుకుంటున్నాను. మరి నువ్వు ఏమనుకుంటున్నావు?" ఇలా ఎంగెల్సుకి ఎకనామిక్స్ సిద్ధాంతాల గురించిన ఉత్తరాలు రాయడం అనేది,ఆ తరువాత 20 సంవత్సరాల పాటు 1870లో ఎంగెల్సు లండన్ వచ్చి స్థిర పడేంత వరకూ కొనసాగింది. ఎంగెల్సు వెంటనే సమాధానం రాసేవాడు.

మార్క్సుకి, ఎంగెల్సు కేవలం ఫ్రెండు మాత్రమే. పిల్లలు మాత్రం ఎంగెల్సుని " అంకుల్ ఏంజెల్"అని పిలుస్తుండేవారు.ఎందుకంటే,ఆ అంకుల్ దగ్గర నుండి వుత్తరం వచ్చినరోజు మంచి ఆహారం లభించేది. ఆ వుత్తరం లో వున్న ఒకటి గానీ, రెండు గానీ వున్న పౌండ్ల నోట్ల వలన. ఆ తరువాత ఈ పిల్లలు పెద్దవాళ్ళయ్యాక తమ జ్ఞాపకాలలో ఈ విశేషాలు కూడా రాసుకున్నారు.ఆ సమయంలోనే ఆడపిల్లలు స్కూలుకి వెళ్ళడం మొదలుపెట్టారు. 3వ పిల్లవాడు 'ఎడ్గర్' మాత్రం చిన్న పిల్లవాడు కాబట్టి ఇంటి దగ్గరే ఆడుకుంటూ ఉండేవాడు.

ఎంగెల్సు ఎంత సహాయం చేసినప్పటికీ, మార్క్సు కుటుంబానికి అది తాత్కాలిక సహాయంగానే వుండేది. ఎంగెల్సు నుండి ఎప్పుడైనా సహాయం ఆలస్యం అయితే మళ్ళీ ఇంట్లో వున్న వస్తువులు ఏవైనా తాకట్టు పెట్టడం, మళ్ళీ వెసులుబాటు కలిగినప్పుడు ఆ వస్తువులు విడిపించు కోవడం ఇదంతా ఒక సైకిల్ లాగ జరుగుతుండేది. అందుకనే ఒక 4 రోజులు పరవాలేదు అనుకుంటే, మరో 4 రోజులు కష్టాలే అన్నట్లుగా వుండేది మార్క్సు కుటుంబ పరిస్థితి.

గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఇలాంటి పరిస్థితి ఏదో కొన్నాళ్ళు కాదు. జీవితాంతం కొనసాగింది. మార్క్సు వాళ్ళ అమ్మ ఉత్తరాలు రాసేటప్పుడు అంటుండేదట..

"ఒరే,అబ్బాయ్! నువ్వేదో 'కేపిటల్' అనే పుస్తకం రాస్తున్నట్టుగా విన్నాను. ఆ కేపిటల్ పుస్తకం రాసే బదులుగా 'కేపిటల్' సంపాదించడం ఎలాగో నేర్చుకో. కనీసం పిల్లలన్నా బాగుపడతారు "అని రాసేదట.

మార్క్సు కూడా యేమనుకున్నాడంటే? కేపిటల్ సంపాదించాలని కాదు. అప్పటికి ఇంకా ఆ పేరు పెట్టలేదు. 'ఈ కేపిటల్ త్వరగా పూర్తి చేసేస్తే, అమ్మకాలు అవుతాయి. డబ్బులు వస్తాయి. కొంచెం అయినా ఈ బాధలు తగ్గుతాయి' అని.

అదే రోజుల్లో ఎంగెల్సుకి ఒక వుత్తరం లో రాశాడు. ”నేను ఇదే వేగం తో రాస్తే గనక 5, 6 వారాల్లో పూర్తి చేసేస్తాను. దాన్ని గనక పబ్లిషర్ కి ఇస్తే గనక కనీసం కొన్ని సంవత్సరాల పాటు ఆర్ధిక ఇబ్బందులు తప్పుతాయి.”అని.

ఆ 5,6 వారాలు అనుకున్నది 16 సంవత్సరాల పాటు కొనసాగింది. దానికి రకరకాల లైన కారణాలున్నాయి. మార్క్స్ ఏది రాసినా గానీ, సమగ్రమైనటు అధ్యయనం చేయనిదే రాసేవాడు కాదు. అదొక కారణం అయితే, ప్రతి క్షణం పరిక్షిస్తున్నటువంటి పేదరికం ఒక కారణం. మార్క్స్, అతని మిత్ర బృందాలు చేసే రహస్య కార్యక్రమాల గురించి జర్మనీ ప్రభుత్వం, అక్కడ నుండి వీళ్ళను ఎలా అణగదొక్కాలా అని చేసే ప్రయత్నాలు..ఇలా రకరకాలయి నటువంటి పరిస్థితులు చుట్టి ముట్టి వుండడం చేత మార్క్సుకి ఆ పుస్తకం రాయడానికి అన్ని సంవత్సరాలు పట్టింది. ఈ విషయాలన్నీ తరువాత తెలుసుకుందాం.

ఈ కొత్త ఇంటికి వచ్చాక మార్క్సుకి మిత్రులు ‘కమ్యునిస్ట్ లీగ్‘ సభ్యుల రాక ఎక్కువయింది. ముందు గదిలోనే అందరి సమావేశాలు జరుగుతూ ఉండేవి. పిల్లలు కూడా అక్కడే ఆడుకుండేవారు. మార్క్స్ “మేం పెద్దవాళ్ళం మాట్లాడుకుంటున్నాం. మీరందరూ ఇక్కడ ఎందుకు?”అనే వాడు కాదు. పిల్లల్ని తన దగ్గరే ఉంచుకునేవాడు. పైగా అనేవాడు “పిల్లల దగ్గరనుండి మేం నేర్చుకోవలసింది ఎంతో వుంది. అందుకని పిల్లల్ని మా దగ్గరే ఉండనీ”అనే వాడట.

నిజానికి బయట గానీ, మిత్రుల సమక్షంలో గానీ,ప్రత్యర్ధుల సమక్షంలో గానీ చాలా భయంకరమైనటు వంటి వ్యక్తి. ఇక్కడ ‘భయంకర ‘అంటే, తను అనుకున్నటువంటి విషయాల్ని మిగతా అందరూ వినాలి. అనుకునే మనస్తత్వం అంతే, ఇంట్లో భార్యా, పిల్లల దగ్గర చాలా సాంసారికమైనటువంటి మనిషి. వాళ్ళ మీద విపరీతమైన ప్రేమాభిమానాలు పంచుతూ ఉండేవాడు. ఇంట్లో వున్న మార్క్స్, బయట ప్రత్యర్ధులతో వాదిస్తున్న మర్క్స్ ఒకడేనా అనే సందేహం కలిగేటట్లుగా ఉండేవాడు.

తరువాత జరిగినటు సంఘటన 1851 మార్చ్ 28న కొత్త ఇంట్లో జెన్నీ మరో ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ పుట్టిన పాప 5 వ సంతానం. జీవించి వున్న వాళ్ళలో 4వ సంతానం. “ఫ్రాన్సిస్కా”అని పేరు పెట్టుకున్నారు. పాప పుట్టింది అన్న సంతోషంలో జెన్నీ ఉండగానే అసలు బాంబు పేలింది. ఇక్కడ నుండి మొదలై తరువాత 7,8, నెలల పాటు మార్క్సను సమస్యలు ఒకదాని తర్వాత మరొకటి చుట్టు ముట్టాయి. అందులో మొదటిది హెలెన్ గర్భవతి అని తెలియడం. కాకపోతే ఈ సమస్యకు తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత తనదే అని మార్క్స కు తెలుసు.

ఇంకా బాలింతరాలుగానే వున్న జెన్నీకి విషయం తెలిసింది. జెన్నీ, మార్క్స నుండి ఆశించినది ఎప్పుడూ కూడా నిజయతీ గల ప్రేమ అంతే. ‘మరి ఇప్పుడు హెలెన్ తల్లి కాబోతున్నదని తెలిస్తే జెన్ని ఏమనుకుంటుంది?’ ఇది మార్క్సను నిరంతరం వెంటాడుతున్నప్రశ్న.ఈ విషయం తెలిస్తే, ఏమైనా కావచ్చు. ఒకటి, “నీ మీద నమ్మకం కోల్పోయాను” అని చెప్పి, పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోవచ్చు. లేదా చిన్నప్పటి నుండి తన చేతులతో పెంచిన జెన్నీ ముందు దోషిగా

నిలబడలేక హెలెన్ వీళ్ళను వదిలేసి వెళ్లిపోవచ్చు. అది కూడా వీళ్ళకే నష్టం. ఈ రెండింటి కంటే ప్రమాదకరమైన సందర్భాలున్నాయి మార్క్స్ కి. ఏమిటంటే, అదే సమయంలో ప్రష్యా లో ' కమ్యూనిస్ట్ లీగ్ 'కోసం వేట మొదలయ్యింది. అనేకమంది మార్క్స్ మద్దతుదార్లను అరెస్ట్ చేసి, జర్మనీ జైళ్ళల్లో వేశారు. అంతే కాకుండా వాళ్ళ నాయకుడైన మార్క్స్ మీద చర్య తీసుకోమంటే, బ్రిటిష్ ప్రభుత్వం ఏమీ చెయ్యలేదు కాబట్టి, మనమే మార్క్స్ని రెడ్ హేండ్ గా పట్టుకోవాలని, ప్రష్యా ప్రభుత్వం గూడచారులను లండన్ పంపించింది.

వాళ్ళందరూ మార్క్స్ ఇంటి చుట్టూ ఉంటూ, ఎప్పుడు మార్క్స్ ఇంట్లోకి వెళ్ళడానికి అవకాశం దొరుకుతుందా అని వేచి చూస్తుండేవారు. ఇంకొక నాటకీయమైన పరిణామం ఏమిటంటే, గూఢచారుల్ని పంపించింది ఎవరో కాదు. మార్క్స్ బావమరిదే. మనం మొదట్లో చెప్పుకున్నాం 'మార్క్స్, తన చెల్లెల్ని చేసుకోవడం ఇష్టం లేదని.' శత విధాల ప్రయత్నించాడు. మార్క్స్, జెన్నీల పెళ్లి చెడగొడదామని. కాకపోతే జెన్నీ పట్టుదల వలన ఈ పెళ్లి జరిగింది. అప్పటి నుండి అతను మార్క్స్, జెన్నీలు ఎలా వున్నారు అని గమనిస్తూనే వున్నాడు. పైగా మన కథ జరుగుతున్న సమయానికి ఆ మార్క్స్ బావమరిది ప్రష్యా ప్రభుత్వంలో 'ఇంటర్నల్ మినిస్టర్ ' అంటే 'హోం మినిస్టర్' గా పదవిలో వున్నాడు.

ఈ పరిస్థితుల్లో మార్క్స్ ఇంట్లో జరుగుతున్న ఈ తతంగం అంటే, హెలెన్ గర్భవతి అన్న విషయం, బయటకు పొక్కితే, మార్క్స్ మీద నిఘా వేసిన గూడచారులకు మాత్రమే కాకుండా, మార్క్స్ వ్యతిరేకులకు కూడా పదునైనటువంటి ఆయుధం దొరికినట్లుగా అవుతుంది. ఇవన్నీ కూడా రుజువైతే మార్క్స్కి జైలు శిక్షో, దేశ బహిష్కరణో జరగవచ్చు. అందువల్ల ఎలాగైనా గానీ, ఈ విషయం బయటకు పొక్కకూడదు. అందుకని మార్క్స్ ఏం చేశాడంటే, హుటాహుటిన బయలుదేరి, ఎంగెల్సు దగ్గరకు వెళ్ళాడు. జరిగినదంతా చెప్పాడు. "ఎలాగైనా సరే,నువ్వే కాపాడాలి."అని అర్థించాడు. హెలెన్ మాతృత్వానికి తనే కారణం అని ఆ నెపాన్ని తనపై వేసుకోవడానికి సిద్దమయ్యాడు ఎంగెల్సు.

నిజానికి దానికి కారణం మార్క్సేనని చాలా మంది చరిత్ర కారులు రాశారు. మరి కొంతమందేమో అది నిర్ధారణ కాలేదు కాబట్టి, ఎందుకు మార్క్స్ మీద నింద వెయ్యడం అన్నారు. ప్రపంచం ముందు ఈ రెండు వాదనలూ వున్నాయి కాబట్టి, ఏది నిజం అనేది ఖచ్చితంగా ఒక నిర్ణయానికి రాలేము. నిజానిజాలు వాళ్ళకే తెలియాలి. కాబట్టి, ఆ విషయాన్ని అక్కడ వదిలేసి మిగతా కథనం మీద దృష్టిపెట్టడం మంచిది.

ఆ నెపాన్ని తన మీద వేసుకోవడమే కాకుండా "నేనూ వస్తాను పద" అని మార్క్స్ తో కలిసి లండన్ వచ్చాడు. రెండు వారాలు మార్క్స్ ఇంటిలోనే వుండి, జెన్నీ కి చెప్పాడు."హెలెన్ కి పుట్టబోయే బిడ్డకు నేనే తండ్రిని" అని. ఏది నిజమో మార్క్స్కీ, హెలెన్లకే తెలియాలి. జెన్నీ మరి నిజంగా నమ్మిందో, తను బయటకు వెళ్తే, తన భర్తకు జరగబోయే ప్రమాదాన్ని గ్రహించి చెడు నిజాన్ని దిగమింగిందో, లేదా జెన్నీ, హెలెన్లుగానీ, మార్క్స్, హెలెన్లు గానీ ఏం

మాట్లాడుకున్నారో తెలియదు గానీ పరిస్థితి చేయి జారిపోకుండా కాపాడింది జెన్ని. విషయం బయటకు పొక్కలేదు. ముఖ్యం గా ప్రష్యాలోని తన అన్నయ్యకు తెలియనివ్వలేదు.

1851 జూన్ 23 వ తేదిన హెలెన్ ఒక మగ బిడ్డకు జన్మనిచ్చింది. "హెన్రి ఫ్రెడరిక్ డెముద్"అని పేరు పెట్టుకున్నారు. ఈ ఫ్రెడరిక్ అనేది ఎంగెల్సు పేరులో మొదటిది.ఈ 'డెముద్' అనేది హెలెన్ ఇంటి పేరు. అదే కొడుక్కి వెళ్ళింది. క్లుప్తంగా "ఫ్రెడి"అని పిలిచేవాళ్ళు.

మార్క్సు, జెన్నీల పాపకి కూడా అప్పటికి 3 నెలల వయసు. అంటే, ఒకే ఇంట్లో ఇద్దరు తల్లులున్నారు. అంత క్లిష్టమైన పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. ఒకరికొకరు ఎలా సహాయం చేసుకున్నారో గానీ, హెలెన్ కి కొడుకు పుట్టాడు అనే విషయం ఎంగెల్సు కి తప్ప బయట ఎవరికీ తెలియకుండా కాపాడుకోగలిగారు. ఒక 6 వారాల తర్వాత 1851 ఆగస్ట్ లో "ఫ్రెడి"పుట్టుకను నమోదు చేయించింది హెలెన్. అందులో తండ్రి పేరు ఏమీ రాయలేదు. ఆ తరువాత కొద్ది వారాలకి 'ఫ్రెడి' ని పెంచడానికని 'లెవీ' అని ఇంకో కుటుంబం వాళ్లకు దత్తత ఇచ్చినట్లుగా ఇచ్చారు. వాళ్ళు కూడా చాలా పేదవారు. పనులు చేసుకునేవారే.'ఈస్ట్ లండన్ 'అని లండన్ లో అత్యంత నిరుపేదలు వుండేటటువంటి ప్రదేశం.

మరి వాళ్ళు కూడా పేదవాళ్ళే కదా! పిల్లవాడిని పెంచాలంటే డబ్బులు కావాలి కదా! వాళ్ళకు నెలనెలా డబ్బులు ఇచ్చేలాగా ఎంగెల్సు ఒప్పుకున్నాడు. మొదట ఆ ఒప్పందంతో ఆ పిల్లవాడిని వాళ్లకు ఇచ్చారు. కొన్ని రోజులు హెలెన్ కూడా వెళ్లి వస్తుండేది అని చెబుతుంటారు. ఆ తరువాత రోజుల్లో కూడా ఆ కుర్రవాడికి ఊహ తెలిశాక, మార్క్సు లేని సమయంలో మాత్రమే వచ్చి తల్లిని చూస్తూ ఉండేవాడట.[మార్క్సు లేనప్పుడు ఎందుకు రావడం. ఉన్నప్పుడే రావచ్చు కదా!] అవకాశం దొరికినప్పుడల్లా హెలెన్ కూడా కొడుకుని చూసి వస్తుండేది. ఆ తరువాత ఈ 'ఫ్రెడి' 70 ఏళ్ళ పాటు జీవించాడు.

మార్క్సు, జెన్నిలు చనిపోయిన చాలా రోజులకి, మార్క్సు మూడో కూతురికి తెలిసింది. తనకో అన్నయ్య ఉన్నాడని. ఆ తరువాత ఫ్రెడి తో స్నేహంగా వుండి, తరువాత జీవితాంతం మిత్రులుగా వున్నారు ఆ అన్నా చెల్లెళ్ళు. ఈ విషయాలన్నీ కూడా కథా క్రమంలో తెలుసుకుందాం. మొత్తానికి ఒక ప్రళయం తప్పిపోయింది. కాకపోతే, వీటన్నిటి వలన మార్క్సు రాయాల్సిన "పొలిటికల్ ఎకనామి" పుస్తకం రాయడం చాలా కుంటుపడింది. 7,8, నెలల పాటు ఆయన ఏం రాయడానికి కుదరలేదు. పైగా, మరో పక్క పిల్లలతో పాటు పెరుగుతున్నటు వంటి అప్పులు.

వీళ్ళు ఉంటున్నది లండన్ లో కదా! పక్క దేశమైన ఫ్రాన్స్ లో 1851 డిసెంబర్ 2వ తేదిన రహస్య తిరుగుబాటు వచ్చింది. అది ఎలా జగిందంటే, అప్పటి వరకూ అధ్యక్షుడుగా ఉంటున్న "లూయిస్ నెపోలియన్"[ ఈయన్నే 'నెపోలియన్ బోనా పార్టీ' అని కూడా అంటారు] ఈయన ఏం చేశాడంటే, ఆ తరువాత రాబోయే ఎన్నికల్లో ఓడిపోతాననే భయంతో, ఫ్రెంచి అసెంబ్లీని రద్దుచేసి, తనకి తానుగా ఫ్రాన్స్ కి శాశ్వత సార్వాభౌమాధికారిగా ప్రకటించేసుకున్నాడు.

వ్యతిరేకించినటువంటి వందలాది మందిని కాల్చేయమని ఉత్తర్వులు ఇచ్చాడు. 26వేల మందిని జైళ్ళళ్ళలో కుక్కేసాడు. ఇదంతా ఫ్రాన్సులో.

దీనిని హైలెట్ చేస్తూ 1848 నుండి ఫ్రాన్సులో జరుగుతున్న పరిణామాల గురించి సమగ్ర మైనటువంటి వ్యాసం రాసిపెట్టమని మార్క్సును ఒక పాత్రికేయ మిత్రుడు అడిగాడు. ఎందుకు అడిగాడంటే, "నేను న్యూయార్క్ నుండి ఒక జర్మన్ పత్రికను తీసుకురాబోతున్నాను. ఆ కమ్యునిస్ట్ పత్రికలో ప్రకటించడానికి ఈ వ్యాసం రాసిపెట్టు. దానికి తగిన పారితోషికం ఇస్తాను." అన్నాడు. అసలే అప్పుల ఊబిలో వున్నాడేమో మార్క్స 'ఇది మంచి అవకాశం' అనుకున్నాడు. ఆ వ్యాసం రాయడం మొదలుపెట్టాడు. ఆ వ్యాసం రాసేటటు వంటి క్రమంలో మార్క్స, జెన్నిలకు ఒక మంచి పని జరిగింది. అదేమిటంటే, గత 6 నెలల నుండి హెలెన్ ప్రసవించడం, పిల్లవాడిని దత్తత ఇవ్వడం వీటివలన మార్క్స, జెన్నిల మధ్య ఒక రకమైన నిశ్శబ్దం వుండేది. దాని నుండి బయటకు వచ్చి, మార్క్స, జెన్నీల మధ్య బంధం కొంచెం పెంపొందడానికి, ఇదిగో ఈ వ్యాసం రాయడం అనే ప్రక్రియ తోడ్పడింది.

ఎలాగంటే, మార్క్స రాసినటువంటి పేపర్లన్నీ జెన్నీ ఫెయిర్ చేస్తుండేది. ఒకవైపు నెలల పాపను చూసుకుంటూ, మరొక వైపు భర్తకు సహాయం చేస్తుండేది. ఇలా వున్న రోజుల్లోనే మార్క్స ఆరోగ్యం దెబ్బతినడం ప్రారంభమయ్యింది అనుకోవడం కంటే, కొంచెం కొంచెంగా దిగజారడం మొదలయ్యింది అనుకోవచ్చు.

ఆయనకు పైల్స్ వ్యాధి రావడంతో లైబ్రరీ కి వెళ్ళలేకపోయేవాడు. అందుకని ఇంట్లోనే కూర్చొని రాసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. తీవ్రంగా ఆలోచించేటప్పుడూ, ఏకాగ్రత కావాలను కున్నప్పుడూ రాత్రి పూట పడుకున్నాక అప్పుడు ఆయనకు ఏకాంత మైన సమయం దొరికేది. తీవ్రంగా ఆలోచించి రాయడానికి, ఆ సమయంలో వాళ్లకి వున్న 3 గదుల్లో ముందు గదిలో కూర్చొని రాసుకుంటూ ఉండేవాడు. అక్కడికేమో వేడికోసం ఉపయోగించే బొగ్గుల కుంపటి ఉండేది కాదు. అందుచేత చలి ఎక్కువగా వుండేది. పైగా అర్ధరాత్రి పూట, నూనె దీపం వెలుతురో, లేకపోతే కొవ్వొత్తి వెలుతురులోనో తెల్లవారుజామువరకూ రాసి, రాసి అలాగే ముందు గదిలోనే పడుకుండిపోయేవాడు. ఈ కొవ్వొత్తి వెలుగు కాకుండా, కాస్త వెలుతురు ఎక్కువగా రావాలంటే 'పారాఫిన్ వేక్సిన్ ' అని వుంటుంది. అదయితే, ఎక్కువ వెలుగు వస్తుంది. అది వెలిగించి వుంచుదామంటే, దాంతో వచ్చిన ఇబ్బంది ఏమిటంటే, వాసన ఎక్కువ వస్తుంది. దానికి తోడు చిన్న గది.ఆ వాసన బయటకు వెళ్ళేది కాదు. దాంతో తలనొప్పి వచ్చేసేది. వీటన్నిటితో ఎప్పుడో పొద్దున్న ఈయన పడుకుండేసరికి, ఇంట్లో వాళ్ళు లేచిపోయేవాళ్ళు.

ఇది ఒక రోజు కాదు. దాదాపు పగలు కూడా ఇలాగే, కొవ్వొత్తి వెలిగించాల్సి వచ్చేది. ఎందుకంటే, చలికాలం అవడంతో బయట మేఘాలు పట్టేసి ఉండేవి. మంచు తెరలతోటి చీకటిగా ఉండడంతో పగలు కూడా కొవ్వొత్తి వెలుతురు లోనే, పని చెయ్యాల్సి వచ్చేది. ఇలా రోజుల తరబడి చేసేసరికి అసలే అంతంత మాత్రంగా వున్న మార్క్స ఆరోగ్యం

ముఖ్యంగా కంటి చూపు దెబ్బతింది. కనీసం ఈ వ్యాసం పూర్తయితే కాస్తన్నా డబ్బులు వస్తాయి అని, అంతగా కష్టపడి ఆ వ్యాసాన్ని కొనసాగించాడు. మార్క్సుకి, జెన్నీ సహాయం కూడా వుంది. ఇంతా చేసి, ఆ వ్యాసం పూర్తి చేసి, ఆ మిత్రుడికి పంపించేసరికి అతను ఇలా రాశాడు.

"ముందు అనుకున్నట్లుగా పేపరు ప్రారంభించడం లేదు. నాకు ఆర్థిక ఇబ్బందులున్నాయి. కాబట్టి, నువ్వు రాసినటువంటి ఈ వ్యాసం నాకు అక్కర లేదు. ఇప్పుడు డబ్బులేమీ ఇవ్వలేను." అని ఉత్తరం రాశాడు.

దాదాపు రెండు నెలలపాటు మార్క్సు పడినటు వంటి శ్రమ అంతా కూడా అప్పటికి వృధా అయ్యింది. పైగా ఆయన ఆరోగ్యం కూడా దెబ్బతింది. పోనీ, ఇంకెవరైనా తీసుకుంటారేమోనని జెన్నీ ఏం చేసిందంటే, మార్క్సు తరుపున వేరే పేపరు వాళ్ళను సంప్రదించింది. సంప్రదించడం అంటే, ఉత్తరాలు రాయడమే. ఏ వైపునుండి కూడా సానుకూలమైన సమాధానం రాలేదు. మరీ ఇబ్బంది గా వుండేది. ఒక్కోసారి తిండికి కూడా కటకట లాడుతుండేవారు. ఎంగెల్సు నుండి అప్పుడప్పుడు డబ్బులు వస్తుండేవి. అవి ఒక వారం వరకూ సరిపోయేవి.

ఈ పరిస్థితిలో 1852 ఏప్రిల్ నెల మొదట్లో చిన్నపాప 'ఫ్రాన్సిస్కా' కి విపరీతమైన దగ్గు రావడం ప్రారంభమయ్యింది. అంతకు ముందు రెండు, మూడు రోజుల ముందే మొదటి పుట్టినరోజు జరిగింది. ఏడాదిన్నర క్రిందట పసివాడు 'హెన్రిక్' చనిపోయినట్లుగా, ఈ పాప కూడా సంవత్సరం వయసు దాటిన పదవ రోజుకి 1852 ఏప్రిల్ 14న బాగా ముదిరిపోయినటువంటి 'బ్రాంకైటీస్' చనిపోయింది. మార్క్సు కుటుంబంలో ఇది రెండో పసి మరణం. కారణం మళ్ళీ అదే. సరైన వైద్య సదుపాయం లేదు. పోషకాహారం లేదు. నిజానికి ఆరోజుల్లో ఇలాంటి శిశు మరణాలు ఎక్కువగా ఉండేవి. పుట్టిన పసి వాళ్ళలో దాదాపు 15 శాతం మంది సంవత్సరం మించి బ్రతికేవారు కాదు.

కాకపోతే మార్క్సు, జెన్నీల పరిస్థితి వేరు. ఈ పాప మరణాన్ని మించిన బాధ మరొకటి ఏమిటంటే, అ పాప మృతదేహాన్ని ఉంచడానికి శవ పేటికను కొనడానికి కూడా డబ్బులు లేవు. పగ వాడికి కూడా రాకూడదు అనుకునేటటువంటి పరిస్థితి. సరైన స్థితిలో శవాన్ని శ్మశానానికి తీసుకు వెళ్లలేక, ఏడాది నిండి నటువంటి 'ఫ్రాన్సిస్కా' మృతదేహాన్ని వెనక గదిలో ఉంచారు. ఈ విషయాలన్నీ కూడా జెన్నీ తరువాత తన డైరీలో రాసుకుంది. "ముగ్గురు పిల్లల్ని పెట్టుకొని మధ్య గదిలో పడుకున్నాను. వెనక గదిలో మమ్మల్ని వదలి వెళ్ళిన చిన్నారి పాప మృత దేహం వుంది. పిల్లల్ని చూసుకొని నేను. ఆపుకోలేని దుఃఖంతో వాళ్ళు. ఏడుపుని ఆపుకుంటూ, వాళ్ళని ఓదార్చే క్రమంలో నేను."

ఎక్కడైనా అప్పు పుడుతుందేమో శవ పేటిక కొనొచ్చు అని బయటకు వెళ్ళాడు మార్క్సు. ఇది ఆ ఇంట్లో 2,3,రోజులు కొనసాగిన పరిస్థితి. మార్క్సుకి ఎక్కడా అప్పు పుట్టలేదు. ఎంగెల్సు నుండి సమయానికి సహాయం అందలేదు. చివరకు జెన్నికి తెలిసిన ఒక ఫ్రెంచి కాందిశీకుల కుటుంబం వుంటే,వాళ్ళు దయతలచి 2 పౌండ్లు ఇచ్చారు. దాంతో ఒక

చిన్న శవ పేటిక కొని, మూడు రోజుల క్రితం చనిపోయిన 'ఫ్రాన్సిస్కా' మృతదేహాన్ని వుంచి శ్మశానానికి తీసుకువెళ్ళారు. తను చూడకుండానే మరణించిన తన అన్నయ్య దగ్గరకు వెళ్ళిపోయింది 'ఫ్రాన్సిస్కా'

దెబ్బ మీద దెబ్బ మార్క్స్ కుటుంబానికి. ఎంగెల్సు కి రాసిన ఉత్తరంలో మార్క్స్ ఇలా రాశాడు.[ఈ ఉత్తరాలన్నీ కూడా మనకు వాల్యుమ్స్,, వాల్యుమ్స్‌గా దొరుకుతాయి] "మా పెళ్ళయిన దగ్గర నుండి కూడా జెన్నీకి బాధలూ, కష్టాలూ తప్ప ప్రశాంతత లేదు. మరీ రెండు సంవత్సరాలుగా మాకు ఎదురవుతున్న దురదృష్టాలు చూస్తుంటే జెన్ని కి ఏమవుతుందో నని భయంగా వుంది. ఇల్లంతా ఒకటే ఆసుపత్రి లాగా వుంది. నా ఆరోగ్యం ఎలాగూ పాడయింది. అయినా పరవాలేదు. నేను ఎలా వున్నా నా రచనా వ్యాసంగాన్ని కొనసాగించగలను. జెన్నీ కి ఏమైనా అయితే, నేను భరించలేను. గత ఏడెనిమిది రోజులుగా ఇంట్లో రొట్టెలూ, బంగాళా దుంపలూ తప్ప ఏమీ లేవు. పిల్లలకి సరైన తిండి ఎప్పటికి అందించగలనో తెలియదు."అని రాశాడు.

అలాంటి పరిస్థితిలో ఇంట్లోవున్నవి తాకట్టు పెట్టడం తప్ప మరో గత్యంతరం లేదు. ఇదెప్పుడు జరుగుతున్నదే విషయమే. ఈ పరిస్థితిలో ఇంట్లో వున్న వెండి సామాన్లు తాకట్టు పెట్టడానికి తీసుకు వెళ్ళాడు మార్క్స్. మార్క్స్ యొక్క వాలకం, అతను తెచ్చిన విలువైన సామాన్లూ చూసి, ఆ వ్యాపారికి అనుమానం వచ్చి, పోలీసులకు చెప్పాడు. "అది దొంగ సొత్తేమోనని" దాంతోటి పోలీసులు మార్క్స్ ను పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్ళి, ఒక రాత్రంతా ఉంచారు. ఆ మర్నాడు జెన్ని వెళ్లి , "ఆ వెండి వస్తువులన్నీ తన పుట్టింట నుండి వచ్చినవి "అని చెప్పిన తర్వాత వదిలారని కొంతమంది చరిత్ర కారులు రాశారు. ఇంత దుర్భరమైన పరిస్థితుల్లో వుండగా 1852 మధ్యలోనే చీకట్లో చిరు దీపం అన్నట్లుగా ఒక చిన్న శుభవార్త వచ్చింది. అదేమిటంటే, న్యూయార్క్ నుండి ఆయనకు ఒక వుత్తరం వచ్చింది. అది 'న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్' అనే వార్తా పత్రిక వాళ్ళు రాశారు. యూరప్ లోని వార్తల్ని ప్రత్యేకంగా మాకు రాయడానికి వీలవుతుందా? వారానికి ఒక వ్యాసం రాసి పంపండి. ఒక పౌండ్ ఇస్తాము."అని రాశారు. మార్క్స్ ఆలోచించకుండా వెంటనే ఒప్పుకున్నాడు. ఎందుకంటే. ఒప్పుకొని తీరాల్సిన పరిస్థితి. కుటుంబం గడవడానికి ఎంతోకొంత ఆర్జించక తప్పనిసరి పరిస్థితులు. అయితే, ఒప్పుకున్నాక అసలైన సమస్య ఎదురైంది.

మార్క్స్‌కు వ్యాసం రాయడానికి ఏమీ ఇబ్బంది లేదు. కాకపోతే భాష. అది న్యూయార్క్ నుండి వెలువడే పత్రిక కాబట్టి, ఇంగ్లీష్ లో రాసి పంపించాలి. మార్క్స్ అప్పటి వరకూ రాసినవన్నీ జర్మన్ లోనే రాశాడు. ఇంగ్లీష్ మాట్లాడడం, రాయడం అంత ధారాళంగా రాదు అప్పటికి అంటే, 1852 నాటికి. మళ్ళీ ఇలాంటి పరిస్థితుల్లో ఆదుకున్నది ఎంగెల్సే. మార్క్స్ జర్మన్ భాషలో రాసినటువంటి వ్యాసాల్ని ఎంగెల్సు కి పంపిస్తే, ఆయన వాటిని ఇంగ్లీష్ లోకి అనువాదం చేసి మార్క్స్ కి పంపిస్తే, అప్పుడు మార్క్స్ న్యూయార్క్ కి పంపించేవాడు. అలా వారానికి ఒక పౌండ్ వచ్చేది.మార్క్స్ అలా

రాసినటువంటి మొట్ట మొదటి వ్యాసం 1852 ఆగస్ట్ 21 తేదిన 'న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్' లో వచ్చింది.అది జరిగిన నాలుగైదు నెలల్లోనే మార్క్స్ సొంతంగా ఇంగ్లీష్ లో రాయగలిగే స్థాయికి వెళ్ళాడు.

మార్క్స్ రాస్తున్నటువంటి వ్యాసాలు ఆయన ధైర్యంగా యూరప్ లోని సంక్షోభం గురించినటు వంటి విషయాలు. ఆయన రాసిన శైలీ, విషయాలూ అమెరికన్ ప్రజలకు విపరీతంగా నచ్చింది. నాలుగైదు నెలల్లోనే వాళ్ళు ఇస్తున్న కోటా పెంచారు. "వారానికి రెండు వ్యాసాలు తీసుకుంటాము, రెండు పౌండ్లు ఇస్తాము." అన్నారు. మార్క్స్ కి కావలిసింది కూడా అదే. ఈ పనులన్నిటి పనుల వలన ఏడాది క్రితం ఆపేసినటు వంటి 'పొలిటికల్ ఎకనామిక్స్ ' పుస్తకం అక్కడే ఆగిపోయింది. ఆ తరువాత 15 సంవత్సరాలకి పూర్తయ్యింది.

1853 రానే వచ్చింది. అక్కడ మార్క్స్ సొంత దేశమైన ప్రష్యా జైల్లో వున్నారు కదా! మార్క్స్ అనుచరులు. వాళ్ళ కేసు కోర్ట్ లో వాదనకు వచ్చింది. వాళ్లకు కావలిసిన సహాయం చేయడానికీ, కేసు వాదించడానికి అవసరమైన సమాచారం అందించడానికీ, మార్క్స్ ఒక్కడే సరైన మేధావి. రోజంతా మార్క్స్ ఇంట్లోనే సమావేశాలు జరిగుతుండేవి. ప్రష్యా లో అరెస్ట్ చేసిన అనుచరుల్ని ఎలా విడిపించాలి? ఏం చేయాలి అనే చర్చలన్నీ మార్క్స్ ఇంట్లోనే జరుగుతుండేవి. ఇల్లంతా మార్క్స్ అనుచరులతో హడావుడిగా వుండేది. మార్క్స్ మీద గట్టి నిఘా వుండేది. ఆ రోజుల్లో మార్క్స్ జీవన శైలి గురించి ఒక గూఢచారి పంపిన నివేదిక చాలా ఆసక్తిదాయకం వుంటుంది. ఆయన ప్రభుత్వానికి పంపిన నివేదికలో ఏం రాసాడంటే.…

"లండన్ లో అతి నిరుపేదలు నివసించే ప్రాంతంలో , మహా మేధావి కార్ల్ మార్క్స్ నివసిస్తున్నాడు. ఆయన ఆలోచనలూ,రాతలూ, యెంత ఘాటుగా, తీవ్రంగా ఉంటాయో, ఆయన నివసించే గదులూ, కుటుంబ జీవన శైలీ అంత దయనీయంగా, దుర్భరంగా వుంటాయి. మార్క్సుని ఎప్పుడు చూసినా కళ్ళు ఎర్రగా తాగిన వాడి లాగా కనిపిస్తాయి. ఆయన ఎప్పుడు పడుకుంటాడో, ఎప్పుడు లేస్తాడో ఎవరికీ అర్ధం కాదు. ఆయన ఇంట్లో ఒక్క వస్తువు కూడా సరైన రూపంలో వుండదు. అన్నీ సగం సగం విరిగిపోయినవే. ముందు గది లోనికి అడుగు పెట్టగానే, ఒక పాత రకం టేబులు వుంటుంది. అంగుళం మందాన ధూళి పట్టేసి వుంటుంది. దానిమీద బోలెడన్ని పుస్తకాలూ, మార్క్స్ సగం,సగం రాసిన చిత్తుప్రతులూ వుంటాయి.ఆ టేబుల్ కి ఒక వైపున ఒక కాలు విరిగిపోయి మూడు కాళ్ళతో మాత్రమే వుంటుంది. అందుకని గోడకి ఆనించి వుంటుంది. దాని మీద పుస్తకాలు చిందర వందరగా పడి వుంటాయి.

ఆ టేబుల్ కి రెండో వైపున కుర్చీ వుంటుంది. దాని మీదే అతిధులు కూర్చోవాలి. అయితే, కూర్చునే ముందు జాగ్రత్తగా చూసుకోవాలి.[బహుశా ఎక్కువమంది కూర్చోవడానికి వీలుగా కాస్త పెద్ద కుర్చీ అయివుంటుంది.] ఎందుకంటే ఆ కుర్చీ మధ్యలో పెద్ద గుంట వుంటుంది.అందులో పిల్లల ఆట వస్తువులన్నీ అందులోనే వుంటాయి. జాగ్రత్తగా చూసుకోకుండా కూర్చున్న వాళ్ళ పేంట్లు చిరిగిపోతాయి.ఇంత గందరగోళంగా వున్న ఇంట్లో ఒక్కసారి మార్క్స్‌తో

మాట్లాడడం మొదలుపెడితే...మనం వేరే లోకం లో ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఆయన వివరించే సిద్ధాంతాలూ, ఆయన ఆలోచనలూ వింటుంటే చుట్టూ వున్న సమాజం వేరే కోణంలో కనిపిస్తుంది. ఆయనతో ఎవరైనా అరగంట మాట్లాడి వెళ్ళిన వాళ్ళు ఎవరైనా సరే, సమాజంలోని అసమానతలు రూపుమాపాలి అనే ఆవేశం రాకుండా వుండదు.అందుకే ఆయనతో మాట్లాడిన అనుచరులంతా కూడా గుండెల నిండా ధైర్యాన్నీ, భవిష్యత్తు మీద భరోసాని నింపుకొని వెళుతుంటారు."అని తన నివేదికలో రాశాడు.

సరే! అదలా ఉంచితే, ఆడపిల్లలకి తొమ్మిది, ఏడు సంవత్సరాల వయసు వచ్చింది. స్కూలుకి వెళుతున్నారు. పెద్దమ్మాయి అచ్చం వాళ్ళ నాన్నలాగే వుంటుంది. చిన్నమ్మాయి అచ్చంగా వాళ్ళ అమ్మ లాగా వుంటుంది. ఇద్దరూ చాలా అందంగా,ఆకర్షణీయంగా వుండేవారు. కాకపోతే, వాళ్ళు వుండే లండన్ లోని 'సోహో' ప్రాంతం అనుకున్నాం కదా! ఆ ప్రాంతం అంత క్షేమకరం కాదు. సాయంత్రం అయితే, ఆడపిల్లలని బయటకు పంపించేవారు కాదు. 4, 5 సంవత్సరాల వయసు వున్న 'ఎడ్గర్' బయటకు వెళ్లి అక్కడ వుండే ఐరిష్ పిల్లలతో ఆడుకుండేవాడు. అక్కడ వుండే వాళ్ళందరూ వివిధ దేశాలనుండి పారిపోయి వచ్చిన అక్కడ తలదాచుకున్న వాళ్ళే. వాళ్ళతో కలసి చిన్న చిన్న దుఖాణాల్లో నుండి దొంగతనాలు చెయ్యడం,రొట్టెలు ఎత్తుకు రావడం ఇలాంటి పనులన్నీ చేస్తుంటారు. ఆ 'సోహో' ప్రాంతంలో చిన్న పిల్లలకి నడక రాగానే దొంగతనాలు నేర్పుతుండేవారు.

1854 వచ్చింది. ఈ సంవత్సరం మార్క్స్ కుటుంబంలో మరో అనారోగ్య సంవత్సరం అనుకోవచ్చు.1854 మొదట్లోనే గత కొన్నాళ్ళుగా చిన్నచిన్న అనారోగ్యలతో బాధ పడుతున్న మార్క్స్ ఏకంగా 3, 4 వారాల పాటు పడక వేశాడు. కీళ్ళ నొప్పులూ, ముక్కు లోనూ, నోట్లోనూ పుళ్ళు మొదలయ్యాయి. గాలి పీల్చడం, మాట్లాడడం కూడా కష్టమయ్యేది. నొప్పి తెలియకుండా వుండడానికని మత్తు టేబ్లెట్లు వేసుకునే వాడు. అవి వేసుకుంటే, రోజుల తరబడి నిద్ర పోవడం. వీటన్నిటికి తోడు న్యూయార్క్ కి పంపించాల్సిన వ్యాసాలు వున్నాయి. అవి పంపించడం ఆలస్యం అయితే, అక్కడ నుండి రావాల్సిన రావలసిన డబ్బులు రావు.ఇక్కడేమో పెరిగిపోతున్న డాక్టర్ బిల్లులు. మళ్ళీ గందరగోళం మొదలు.

తమ కంటే కూడా పిల్లల గురించి ఎక్కువ దిగులు పడేవాళ్ళు. ఎందుకంటే, ఆ రోజుల్లో 'కలరా' ఎక్కువగా వుండేది లండన్ అంతటా కూడా. సరైనటువంటి పోషకాహారం, సరైన పరిసరాలూ లేకపోతే పిల్లలకు ఎక్కడ అనారోగ్యం కలుగుతుందేనని ఎక్కువ తాపత్రయ పడేవాళ్ళు. 1854 మర్చి వచ్చేసరికి జెన్నీ మళ్ళీ గర్భవతి అని తెలిసింది. ఇది ఆరవ సారి. నిజానికి అప్పటికి వాళ్ళున్న ఉన్నప్పటి పరిస్థితిలో కుటుంబం లోని మరో ప్రాణిని ఆహ్వానించే పరిస్థితులు లేవు. మళ్ళీ డాక్టర్లూ, మందులూ ఆసుపత్రి బిల్లులూ పైగా అంతకు ముందే ఆ ఇంట్లో మరణించిన రెండు పసి ప్రాణాలు. అయినా తప్పని పరిస్థితి.[అప్పట్లో కుటుంబ నియంత్రణ పద్దతి లేదు అనే విషయం గమనించాలి]

తాత్కాలికంగా మార్క్స్ తరపున ఎంగెల్సు ఆ వ్యాసాలను రాసి పంపిస్తే, వచ్చిన డబ్బులతో ఇల్లు గడుస్తుండేది. అక్కడ ఎంగెల్సు పరిస్థితి కూడా ఏమంత బాగుండలేదు. వాళ్ళ నాన్నకు తెలిసింది ఎవరో అమ్మాయితో సహజీవనం చేస్తున్నాడని. అది తెలిసి వాళ్ళ నాన్న కూడా బెదిరించడం ప్రారంభించాడు. "నిన్ను బయటకు పంపించేస్తానని" అందుకని ఎంగెల్సుకి కూడా మార్క్స్ కి సహాయం చేయడానికి వీలయ్యేది కాదు.

1855 జనవరి 17న ఆరవ బిడ్డకు జన్మనిచ్చింది.ఆ పాపకు 'ఎలినార్' అని పేరు పెట్టుకున్నారు. అంతకు ముందు ఇద్దరు పిల్లలు చనిపోయారని అనుకున్నాం కదా! వాళ్లకి ఎదురైన పరిస్థితి రాకూడదని, అదనపు భారం అయినా గానీ, ఒక 'వెట్ నర్స్' నియమించుకున్నారు. 'వెట్ నర్స్ ' అంటే, ఆరోజుల్లో పసి పిల్లలకు పాలిచ్చి పెంచడానికి అద్దె తల్లులుంటారు.అలా ఒక వెట్ నర్స్ ని నియమిచుకున్నారు. ఆమె చేసే పని ఏమిటంటే, పిల్లకి పాలు ఇవ్వడమే కాకుండా, పిల్ల యొక్క యోగ క్షేమాలు కూడా చూసుకోవాలి. అందుకని ఆ పాపకు ఏ కొంచెం ఇబ్బంది అయినా గానీ, ఆ వెట్ నర్స్ చూసుకుండేది.

అయినా మార్క్స్ కుటుంబాన్ని దురదృష్టం ఇంకా వెంటాడుతూనే వుంది. ఆ ఇంట్లో మరొక ఘోరం పొంచి వుంది.1855 మర్చి, చిన్నపాపకు రెండు నెలల వయసు. అప్పటికి 'ఎడ్గర్' కి 8 ఏళ్ళు. ఎడ్గర్ కి తీవ్రమైన కడుపు నొప్పితరచూ వస్తుండేది. ఎలాగో డాక్టర్ ని బ్రతిమిలాడి వైద్యం చేయించడం ప్రారంభించారు. ఎడ్గర్ కి ఒకరోజు బాగుంటే, మరో రోజు బాగుండేది కాదు. కడుపు నొప్పితో లుంగలు చుట్టుకు పోయేవాడు. డాక్టర్ మందులతో కాస్త మెరుగు పడుతున్నది అనుకునే సమయానికి, మళ్ళీ తీవ్రమైన నొప్పి వచ్చేది. ఎంగెల్సు దగ్గరకు తీసుకువెళితే కనీసం వాతావరణం మారుతుంది అనుకునేవారు. అనుకోగానే, అనారోగ్యం మరి కాస్త ఎక్కువ అయ్యేసరికి డాక్టర్ గారు 'మరి వద్దు లెండి, ఈ పరిస్థితిలో కదల్చడం మంచిదికాదు.' అనడం తో ఆ ప్రయత్నం మానుకున్నారు. జెన్నీ చిన్న పిల్లలతో పడుకొని వుంటే,మార్క్స్, హెలెన్లు ఎడ్గర్ ని చూసుకుండేవారు.

ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ ఇంట్లో వాళ్ళని కూడా నవ్విస్తూ వుండే 'ఎడ్గర్' అలా మంచానికి అతుక్కుపోయేసరికి, ఇంట్లో అందరికీ జీవం పోయినట్లుగా అనిపించింది. వున్న మూడు గదుల్లో మధ్య గదిలో నెలల పసి పిల్లలతో పడుకొని వుంటే, చివరి గదిలో అదే వంట గదీ, అదే స్నానాల గదీ అనుకున్నాం కదా! అక్కడ పడుకుండేవాడు ఎడ్గర్. అవసరమైనపుడు కాస్తలేపి, అటూ ఇటూ తిప్పడం చేస్తుండేవాడు మార్క్స్.

ఆయన పుస్తకాలు చదవడం, రాయడం పక్కన పెట్టేశాడు. పూర్తి కాలం ఎడ్గర్ ని చూసుకోవడం అయ్యేది. ఎడ్గర్ వాళ్ళ అక్కతో చెప్పాడట. "అక్కా! అమ్మ నన్ను చూడ్డానికి వచ్చినపుడు, దుప్పటి పూర్తిగా కప్పేయండి. ఎందుకంటే, పుల్లల్లగా అయిపోయిన నా కాళ్ళు చూసి తట్టుకోలేదు."అని అంత సున్నితంగా ఉండేవాడు చిన్న వాడైన ఎడ్గర్. 1855 ఏప్రెల్ 6న మార్క్స్, ఎంగెల్సు కి రాసినటువంటి ఉత్తరం లో ఈ సంగతులు వున్నాయి.

“పూర్ ఎడ్గర్ ఇక లేదు. సాయంకాలం 5,6 గంటల మధ్యలో నేనే ఎత్తుకుని అటూఇటూ తిప్పుతున్నాను. నాన్నా! అంటూ ఏవేవో కబుర్లు చెప్పాడు. ‘నిద్ర వస్తోంది ’ అన్నాడు. అలాగే నా భుజం మీదే పడుకున్నాడు. నిద్రపోతున్నాడని అనుకున్నాను. హటాత్తుగా ఉన్నట్టుండి ఒళ్ళు చల్లగా తగిలింది. భుజం మీద నుండి చేతుల్లోకి తీసుకున్నాను. లేదు...ఎడ్గర్ లేదు...”అని రాశాడు.

ఆ ఎడ్గర్ మృతదేహాన్ని చిట్టచివరి గదిలోనే ఉంచారు. జెన్ని ఒకవైపూ, మార్క్స్ మరొక వైపూ కూర్చొని వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. జెన్నీ పసి పిల్లతో పాటుగా, ఇద్దరి పిల్లల్ని కూడా దగ్గరగా పట్టుకుంది. వీళ్ళని కూడా ఎవరైనా తన దగ్గర నుండి తీసుకువెళ్ళి పోతారేమోనని. విషయం తెలిసినటువంటి మార్క్స్ మిత్రులు అందరూ వచ్చారు. ఆయన్ని ఓదార్చడానికి ప్రయత్నిస్తే...”నా బాబు చనిపోలేదు. నా బాబు ని ఎవరో దొంగిలించుకు పోయారు. నా పేదరికమే నా బాబుని దొంగిలించింది.” అంటూ బిగ్గరగా మార్క్స్ ఏడుస్తున్నాడు. ఆ తరువాత తెలిసింది ఎడ్గర్ కి వచ్చిన వ్యాధి “ఇంటస్టయిన్ ట్యూబర్ క్యూరోసిస్“ అంటే, టి.బి లాంటిది అని. ఇంతకుముందు ఇద్దరి పిల్లల్ని సమాధి చేసిన స్మశానానికే ఎడ్గర్ ని కూడా తీసుకువెళ్ళారు. ఆ శవపేటికను బండి మీద నుండి దించి భూమిలోకి పెడుతుంటే, మార్క్స్ ను మిత్రులు గట్టిగా పట్టుకున్నారట. ఆ ఆవేదనతో ఆ గోతిలోకి ఆయన కూడా దూకుతాడా? అనిపించిందట. ఎనిమిదేళ్ళ పాటు మార్క్స్ కుటుంబంలో ఆనందం పంచిన ఎడ్గార్ ఆ విధంగా శాశ్వతంగా ఈ లోకం నుండి శెలవు తీసుకున్నాడు.

కార్ల్ మార్క్స్ మనసా,వాచా,కర్మణా నమ్మిన, క్రుషి చేస్తున్న విప్లవ సిద్ధాంతం,ఆ క్రమంలో సంక్రమించిన పేదరికం ఆ కుటుంబంలో ప్రస్తుతం ముగ్గురిని బలి తీసుకుంది. అది అంతటితో ఆగలేదు. అంత్యక్రియలకు వెళ్లి వచ్చిన తరువాత ఎంగెల్సు వాళ్ళ వూరు వెళ్ళిపోయాడు. ఆ తరువాత కొద్ది రోజులకి మార్క్స్, ఎంగెల్సుకి వుత్తరం రాశాడు

“ ఎడ్గర్ ఎంతగా గుర్తుకు వస్తున్నాడో చెప్పలేను ఎంగెల్స్ ! బ్రతికి ఉన్నంత కాలం, నాజీవితం లోని ప్రతి మలుపులో వుంటాడు ఎడ్గర్. జెన్ని పరిస్థితి కూడా అలాగే వుంది. మాకు మేమే ఓదార్చుకుంటున్నాం. ఎడ్గర్ సాగనంపిన దగ్గర నుండి నాకు విపరీతమైన తలనొప్పి, ఈ నొప్పితో ఏమీ ఆలోచించ లేకపోతున్నాను. అయినా నేను బ్రతికే వున్నాను. నీ స్నేహం మాకు యెంత బలాన్ని ఇస్తుందో, నీకంటే మాకు బాగా తెలుసు. నువ్వు లేకపోతే మేము లేము. మనమిద్దరమూ ఇంకా జీవించే వున్నాము. ప్రపంచంలో మనం సాధించాల్సింది చాలా వుంది.”అని రాశాడు. అది నిజమే నని నిరూపించారు మార్క్స్, ఎంగెల్సులు తరువాత దశాబ్దాలలో ప్రచురించిన ‘కేపిటల్’ సిద్ధాంత గ్రంథం ద్వారా .ఈ పరిణామాలన్నీ జరిగేసరికి 1855 మధ్య కాలం వచ్చింది.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 నవంబర్ 05 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS